'దళితబంధు' కాజేస్తున్నారు..

- లబ్ధిదారుల నుంచి దర్జాగా దోపిడీ చేస్తున్న మధ్యవర్తి
- బర్రెలు, గొర్రెల యూనిట్లలో భారీగా అక్రమాలు
- ఒక్కో లబ్ధిదారు నుంచి లక్షల్లో హంఫట్
- మళ్లీ అవే గొర్రెలు రీసైకిల్ చేస్తూ లెక్కలు
- లబోదిబోమంటున్న దళితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత కుటుంబాలు ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధు పథకం.. అక్రమార్కులు చేరి అందినకాడికి దోచుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లో భారీ కుంభకోణానికి తెరలేపారు. లబ్దిదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఏకంగా లక్షల్లో వెనకేసుకున్నారు. బర్రెలు, గొర్రెల యూనిట్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో యూనిట్‌కు ఏకంగా రూ.1.80లక్షల నుంచి రూ.1.90లక్షల బిల్లులు వేసి ఒక్కో యూనిట్‌లో రూ.80-85 వేల వరకు నొక్కేశారు. ఇలా నాలుగు యూనిట్ల చొప్పున అంటే ఒక్కో లబ్దిదారుడి నుంచి ఏకంగా రూ.మూడు లక్షల వరకు మిగుల్చుకున్నారు. పైగా ట్రాన్‌పోర్టు ఖర్చులు అదనం. మండలానికి ఆనుకొని మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఉన్నప్పటికీ.. మధ్యవర్తి ఒత్తిడితో ఉద్దేశపూర్వకంగా ఏపీలోని అనంతపురం జిల్లా నుంచి గొర్రెలను తీసుకొచ్చారు. ఆ ప్రాంతం నుంచి రవాణా సమయంలోనే పదుల సంఖ్యలో గొర్రెలు చనిపోవడం గమనార్హం. ఇక ఈ గొర్రెల నిర్వహణ తమతో కాదన్న లబ్ధిదారుల నుంచి మళ్లీ అదే మధ్యవర్తి అగ్గువకు కొని మరో లబ్దిదారునికి ఇచ్చినట్టుగా రికార్డులకు ఎక్కించి లక్షలు దోచేశారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకం అమలులో భాగంగా కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. మండలంలోని ప్రతి దళిత కుటుంబానికి రూ.పది లక్షల చొప్పున దళితబంధు అమలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 1298 దళిత కుటుంబాలను గుర్తించారు. ఇందులో 1296 మంది లబ్దిదారులు కోరుకున్న యూనిట్లయిన వరికోత మిషన్లు, జేసీబీలు, ట్రాక్టులు, రవాణా వాహనాలు, కార్లు, టెంట్‌హౌస్, సెంట్రిఫ్, ఫిష్‌పాండ్.. ఇలా రూ.128.30 కోట్ల విలువ గల వాటిని అందజేశారు. ఇందులో పాడి గేదెలు, మేకల పెంపకం అమలు చేశారు. లబ్దిదారుని ఇష్టానుసారం యూనిట్లు ఎంపిక చేయాల్సి ఉండగా.. కొంతమందికి గొర్రెలు, పాడి గేదెలకు ఎంచుకోవాలని అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో చేసేదిలేక అంగీకరించారు. రూ.పది లక్షల్లో రూ.రెండు లక్షలు షెడ్ నిర్మాణానికి పోను.. మిగతా రూ.ఎనిమిది లక్షలతో గొర్రెల యూనిట్లు ఎంపిక చేసుకోవాలి. 20-1 చొప్పున 20 గొర్రెలు, ఒక పొట్టేలును యూనిట్‌గా నిర్ణయించారు. ఇక్కడే మధ్యవర్తి కొంతమందితో కలిసి చక్రం తిప్పాడు.

ఒక యూనిట్‌కు రూ.1.05 లక్షల నుంచి రూ.1,15లక్షల వరకు ధర ఉండగా.. ఏకంగా రూ.1.75లక్షల నుంచి రూ.1.90లక్షల వరకు ఉన్నట్టు నమ్మబలికారు. ఈ రంగంలో ఏ మాత్రమూ అవగాహన లేని లబ్దిదారులతో ఆ ధరకు ఒప్పించి కొనుగోలు చేయించారు. ఇలా ఇక యూనిట్‌లో ఏకంగా ఒక యూనిట్ వెనుక రూ.80-85 వేలు నొక్కేశారు. ఈ విధంగా ఒక్కో లబ్దిదారు నుంచి రూ.మూడు లక్షల వరకు మింగేశారు. ఇక 550 కిలోమీటర్ల దూరంలో అనంతపురం ఉంటే.. ఏకంగా 800 కిలోమీటర్ల చొప్పున లెక్కగట్టి ఒక్కో యూనిట్‌కు ట్రావెల్ ఛార్జీల పేరిట రూ.16 వేల వరకు అదనంగా నొక్కేశారు. అనంతపురం నుంచి వచ్చిన జీవాలు ఇక్కడి వాతావరణంలో నిలదొక్కుకోవడం లేదు. ప్రయాణం కష్టాలకే సగం జీవాలు మెత్తబడుతున్నాయి. ఒక్క ఒడ్డెపల్లిలో సుమారు 40 మంది వరకు జీవాలు అప్పగించారు. అందరిలో కూడా ఇప్పటి వరకు కనీసం పది జీవాలు మృత్యువాతపడ్డాయి. ఇంకా కొన్ని మెత్తబడి ఉన్నాయి. ఎప్పుడు చనిపోతాయో కూడా తెలీదు. మొదటికే మోసం వస్తుందని కొంతమంది బాన్సువాడ సంతలో అమ్ముకున్న పరిస్థితి నెలకొంది. విచిత్రం ఏమిటంటే ఈ జీవాలు చనిపోతుండటంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో లబ్దిదారులు ఉంటే.. వారి నుంచి మళ్లీ ఇవే యూనిట్లను రూ.లక్ష నుంచి రూ.2లక్షలకు కొనుగోలు చేసి మళ్లీ వాటిని కొత్త యూనిట్లుగా పంపిణీ చేస్తున్నారు. ఈ విధంగా సర్కారు సొమ్మంతా దోచుకుంటున్నారు.

దళితబంధు నుంచి చేస్తున్న జీవాల పంపిణీలో ఉన్న మధ్యవర్తిపై ఇది వరకే కేసులు నమోదయిన్నప్పటికీ.. మళ్లీ ఆయనకే అప్పగించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇందులో ఆ మధ్యవర్తి నుంచి ఎవరెవరికి ఎంతెంత ముట్టాయో దర్యాప్తు జరిగితే అసలు నిజాలు బయటకు వచ్చే అవకాశముంది. ఇదే విషయమై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్‌ను వివరాలు కోరగా.. ఆ వివరాలు తమ వద్ద ఉండబోవని అన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులను అడగాల్సిందిగా చెప్పారు. దాంతో పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారిని వివరణ కోరగా.. వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. అసలు లబ్దిదారులకు ఎన్ని యూనిట్లు సరఫరా చేశారు? ఒక్కో యూనిట్‌కు ఎంత నిధులు విడుదల చేశారు? అన్న వివరాలు ఇవ్వడం లేదు. ఏదో విధంగా దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంలో లబ్దిదారులు వివరాలు బయటకు చెప్పేందుకు భయపడుతున్నారు. మళ్లీ తమను కొత్త సమస్యలు సృష్టిస్తారేమోనని భయపడుతున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఐపిఇఎంఎ ప్రెసిడెంట్ చక్రధర్

23 నుంచి పౌల్ట్రీ ఇండియా ప్రదర్శన

- 370 కంపెనీల భాగస్వామ్యం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

నవంబర్ 23 నుంచి మూడ్రోజుల పాటు హైదరాబాద్‌లో 14వ పౌల్ట్రీ ఇండియా ప్రదర్శన జరగనుంది. దక్షిణాసియాలో అతి పెద్దదైన ఈ కార్యక్రమానికి హైదరాబాద్ వేదిక కానుందని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని హైటెక్స్‌లో ఈ నెల 23 నుంచి 25 వరకు జరుగనుందన్నారు. ప్రదర్శనకు ముందు ఈ నెల 22న ప్రత్యేకంగా నాలెడ్జ్ డే టెక్నికల్ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపిఇఎంఎ) ప్రెసిడెంట్ పి చక్రధర్ రావు తెలిపారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ.. "పౌల్ట్రీ ఇండియా ఎక్స్ పోలో భారత్ నుంచి 331 కంపెనీలు పాల్గొనున్నాయి. ఇతర దేశాల నుంచి 39 కంపెనీలు భాగస్వామ్యం కానున్నాయి. దాదాపు 30 వేల మంది బిజినెస్ విజిటర్స్ ఈ ఎక్స్ పోను సందర్శిస్తారని అంచనా. 22న జరిగే నాలెడ్జ్ డే టెక్నికల్ సెమినార్‌లో భారత్, ఆఫ్రికా, యూరోప్, అమెరికా, సార్క్ దేశాల నుంచి 1200 మంది ప్రతినిధులు పాల్గొంటారు. పౌల్ట్రీ ఇండియా గత 13 ఏళ్లుగా ప్రభుత్వం, వివిధ కమ్యూనిటీల సహకారంతో మన దేశంలోని గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టింది. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, యువత, బాలింతలకు ప్రొటీన్లతో కూడిన ఆహారాన్ని అందించింది. తమ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. భారత్‌లో వ్యవసాయం, పశుసంవర్ధక జిడిపిలో కీలకంగా ఉంది." అని అన్నారు. మీడియా సమావేశంలో తెలంగాణ స్టేట్ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఇ ప్రదీప్ రావు, పౌల్ట్రీ ఇండియా ఇసి సభ్యులు కెజి ఆనంద్, టిఎస్ బ్రాయిలర్ బ్రీడర్స్ అసోసియేషన్ సెక్రటరీ హర్ష వర్ధన్ రెడ్డి, ఐపిఇఎంఎ సెక్రటర్ శిరిష్ దోపేశ్వర్, డైరెక్టర్ హరీష్ గర్వారే, ట్రెజరర్ ఉదయ్ సింగ్ బయాస్, ఎన్ఇసిపిసి ప్రెసిడెంట్ బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం సమస్యలు పరిష్కరించండి

- సిఎం కెసిఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలతోపాటు మోడల్ స్కూళ్లు, కెజిబివిలు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. ఉపాధ్యాయ పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. ప్రత్యక్ష నియామక పోస్టులకు ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్‌ను జారీ చేయాలని సూచించారు. భాషాపండితులు, పిఇటిలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం పాఠశాల విద్యలో పర్యవేక్షక పోస్టులైన ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్, బిఇడి, బిపిఇడి లెక్చరర్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని సూచించారు. ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పారిశుధ్యం, సర్వీసు పనుల కోసం గతంలో నియమించిన విధంగానే సర్వీసు పర్సన్లను విద్యాశాఖ నియమించాలని కోరారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు డిఇఒ, మండలాలకు ఎంఇఒ పోస్టులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. 40 ఉన్నత పాఠశాలలకు ఒక జిల్లా ఉప విద్యాధికారి పోస్టు ఉండేలా అదనపు ఉప విద్యాధికారి పోస్టులను మంజూరు చేయాలని తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2012లో కొన్ని గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా మార్చారనీ, కానీ ఇప్పటి వరకు వాటికి రెగ్యులర్ పోస్టులను మంజూరు చేయలేదని వివరించారు. ఆశ్రమ ఉన్నత పాఠశాలలన్నింటినీ గురుకులాల స్థాయిలో అన్ని హంగులతో అభివృద్ధి చేయాలని కోరారు. కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లు (సిఆర్‌టి)గా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 90కిపైగా మోడల్ స్కూళ్లలో ప్రిన్సిపల్, సగం వరకు పిజిటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని విమర్శించారు. వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నగదు రహిత చికిత్స అందించేలా ఆరోగ్య కార్డులివ్వాలని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సిఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సందీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదయ్యగౌడ్

నిధులు విడుదలయ్యేలా చూడండి

- పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీకి సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు రావడం లేదనీ, వాటిని రప్పించేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఈ మేరకు హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన తండాలు, చిన్న గ్రామ పంచాయతీలకు ఆరు నెలల నుంచి కేంద్రం నిధులు, మూడు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వడం, ఇతర పనుల కోసమే ఖర్చులకు నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామంటూ సందీప్‌కుమార్ సుల్తానియా హామీనిచ్చారని యాదయ్యగౌడ్ తెలిపారు.

హైదరాబాద్‌లో ఎన్‌పిఆర్‌డి జాతీయ మహాసభ

- పోస్టర్ ఆవిష్కరించిన టివిసిసి చైర్మన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల చట్టాలను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనీ, వాటిని తిప్పికొట్టేందుకు వికలాంగులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఎన్‌పిఆర్‌డి జాతీయ మూడో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా డిసెంబర్ 26-28 వరకు సంఘం అఖిల భారత మహాసభ నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ మహాసభలో వికలాంగుల హక్కుల, సంక్షేమం గురించి చర్చించాల్సిన అవసరముందని తెలిపారు. దేశంలో వికలాంగులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని గుర్తుచేశారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా పోరాటాలకు రూపకల్పన జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య మాట్లాడుతూ.. 33 జిల్లాల్లో వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలపై సెమినార్లు, చర్చాగోష్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 26న వేలాది మంది వికలాంగులతో నగరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి అర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు జెర్కొని రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శశికళ, నాయకులు శివశంకర్, రజిత తదితరులు పాల్గొన్నారు.

రైతులను రుణ విముక్తుల్ని చేయాలి

- అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలో మాట్లాడుతున్న సారంపల్లి

రైతుల ఆత్మహత్యను నివారించాలంటే.. వారిని రుణ విముక్తుల్ని చేయాలని, కనీస మద్దతు ధర చట్టం తేవాలని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ధరణి అనేక సమస్యలు, లోపాలతో ఉందన్నారు. దాదాపు నాలుగు లక్షల మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకుంటే సగం మందికి పైగా పరిష్కారం కాలేదని విమర్శించారు. దేశానికి అన్నం పెడుతున్న అన్నదాత ఆత్మహత్యలను ఆపాలంటే రైతులను రుణ విముక్తుల్ని చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పండించే పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని, చట్టం తేవాలని అన్నారు. పంటలకు తేమ శాతం, మట్టి తదితర కారణాలతో తక్కువ ధర చెల్లిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఏమీ సాధించుకోలేకపోతున్నామని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఆగిపోయిందన్నారు. మనల్ని పాలిస్తున్న పాలకులు రూ.140 లక్షల కోట్ల అప్పు మన నెత్తిన మోపాలని చూస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్నదాతను అగౌరపరిచే ఐఎఎస్ అధికారులు తమ తీరును మార్చుకోవాలని హితవు పలికారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు జి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకూ పింఛన్ మంజూరు చేయాలన్నారు. మనదేశంలో 40 మంది బడాబాబులు రెండు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి ఎగ్గొట్టి విదేశాలకు వెళ్లి దర్జాగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పెట్టుబడి కోసం పది వేలు అప్పు చేసిన రైతును బ్యాంకర్లు అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మహాసభలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ అంజలి గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం,జిల్లా ఉపాధ్యక్షులు జోషి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి, రైతు సంఘం నాయకులు అశోక్, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించండి

- సిఎస్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలనీ, సమ్మె కాలం వేతనం, పేస్కేలు, వారసులకు ఉద్యోగాలు, ప్రమోషన్ల జీవోలను విడుదల చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల మంది వీఆర్‌ఏలు రెవెన్యూ వ్యవస్థలో కింది స్థాయి ఉద్యోగులుగా ఉంటూ ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధులుగా విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీల అమలు కోసం వీఆర్‌ఏలు రెండేండ్లుగా అధికారులను, మంత్రులను వేడుకున్నా పరిష్కారం లభించలేదన్నారు. అనివార్యంగా 80 రోజుల పాటు సమ్మె చేశారని తెలిపారు. సమ్మె సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకత్వంతో పాటు వీఆర్‌ఏ జెఎసి నాయకులను పిలిచి మునుగోడు ఉప ఎన్నిక తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని స్వయంగా సీఎస్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గిరిజన గడపల దాకా తెలుగు సాహిత్యం

- 'కేసులా' పుస్తక అవిష్కరణలో మంత్రి సత్యవతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు సాహిత్యం గిరిజన గడపల దాకా, బంజారాల జీవితాల దగ్గరకు రావటమనేది సాహిత్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు నిదర్శనమని రాష్ట్ర గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో వెలువడిన తొలి బంజారా కథల సంకలనం 'కేసులా' పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటివరకు సాహిత్య చరిత్రలోకి అంతగా రాని గిరిజనుల జీవన విధానం, వారి సంస్కృతి, కళలు, వీరోచిత గిరిజన యోధుల చరిత్రలపై గ్రంధాలుగా రావటం హర్షణీయమన్నారు. కేసులా అంటే మోదుగు పూలనీ, ప్రకృతిలో పెనవేసుకుపోయిన గిరిజనుల జీవితాలను అద్భుతంగా ఈ కథలలో నిక్షిప్తం చేశారని చెప్పారు. ఈ కథలలో బంజారాల కష్టసుఖాలు, వారి జీవన సంస్కృతి, వారి సంప్రదాయాలు, కట్టుబాట్లు, తరతరాల పురోగతిని కథల సంపుటిగా తేవటం సాహిత్య చరిత్రకు మరింత విస్తృతిని ఇచ్చిందని తెలిపారు. ఈ పుస్తకం సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్, పుస్తక సంపాదకులు డాక్టర్ సూర్యాధనుంజయ్, రమేష్ కార్తీక్ నాయక్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రఘు, ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం

రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.రాజ్‌కుమార్, యం. నగేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.రాజ్‌కుమార్, యం.నగేశ్, గౌరవాధ్యక్షులుగా ఎస్‌వి రమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర మూడో మహాసభ ఇటీవల సంగారెడ్డిలో జరిగాయి. అందులో 43 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఏర్పడింది. 17 మంది ఆఫీస్ బేరర్స్, 25 మంది కమిటీ సభ్యులు ఉన్నారు. కోశాధికారిగా సుమలత, కార్యనిర్వాహక అధ్యక్షులుగా వి.సుధాకర్, ఉపాధ్యక్షులుగా బి.అనిత, వసియాబేగం, లక్ష్మణ్, శరత్, అంజి, లక్ష్మణాచారి, కార్యదర్శులుగా వెంకటయ్య, అరుణ, రమేష్, సునీత, శ్రీనివాస్, శోభారాణి ఎన్నికయ్యారు. ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలనీ, అర్హులైన విఒఎలకు సిసిఎలుగా పదోన్నతులు కల్పించాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మానించారు. మహిళా విఒఎలకు ప్రసూతి సెలవులు, ఒకే రకమైన యూనిఫాం ఇవ్వాలనీ, రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా కల్పించాలని, సెర్ప్ నుంచి విఒఎలకు ఐడీ కార్డులు ఇవ్వాలనే తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

దేశ సమగ్రతకు బిజెపి ప్రమాదం

- ఎన్నికల పొత్తులకు సమయం ఇంకా రాలేదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విలేకరులతో మాట్లాడుతున్న తమ్మినేని

దేశ ఐక్యత, సమగ్రతకు బిజెపి ప్రమాదకరంగా పరిణమించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. రాజ్యాంగ ధర్మాలనూ మార్చి మనుధర్మాన్ని ఆచరణలోకి తెచ్చేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగుతాయన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. దేశంలో బిజెపి భావజాలం, విషసంస్కృతి విస్తరించే ప్రమాదముందన్నారు. లౌకికశక్తులు దీన్ని ఎదుర్కొనేందుకు ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మధ్యయుగాల నాటి అభివృద్ధి, చాతుర్వర్ణ వ్యవస్థ అమలుకు అడ్డుగా ఉన్న రాజ్యాంగ ధర్మాలను సైతం మార్చేందుకు పూనుకుంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ దిశగా ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న తీరును ఖండించారు. పౌరసత్వ సవరణ, ప్రతిపక్షాల అణచివేత, రాష్ట్రాల హక్కులను హరించేలా బిజెపి విధానం ఉందన్నారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అనుసరిస్తున్న విధానాలు- ప్రజలకు జరుగుతున్న నష్టాలను సిఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అపరిష్కృత సమస్యలపై ఉద్యమిస్తామని తెలిపారు. పోడు భూముల విషయంలో చట్టప్రకారం సర్వే నిర్వహించాలని సిఎం దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఎఫ్‌ఆర్సీలు, గిరిజన, రెవెన్యూశాఖలను విస్మరించి అటవీశాఖకు సర్వే బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. పొజిషన్‌లో ఉన్న ప్రతిఒక్కరి భూమి సర్వే చేయాలని సూచించారు. వలస ఆదివాసీలకు హక్కు లేదనడం సరికాదని, అర్హులందరికీ పట్టాలివ్వాలని కోరారు. ఆదివాసీలను నక్సల్స్‌గా చిత్రీకరించడం తగదన్నారు. అసంఘటిత రంగ కార్మికుల వేతన జిఒ సవరించాలని డిమాండ్ చేశారు. 1998, 2008 డిఎస్‌సి అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. స్పౌజ్ సమస్యను పరిష్కరించాలన్నారు. ధాన్యం కొనుగోళ్ళ జాప్యాన్ని నివారించాలని తెలిపారు. పంటలపై తామర నల్లి ప్రభావం మళ్లీ ప్రారంభమైందని, నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, ఇలాగే నిర్వహిస్తే ప్రాజెక్టు పూర్తయ్యేందుకు 40 ఏండ్లు పడుతుందని విమర్శించారు. దక్షిణ తెలంగాణలో నీటివనరులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ఎన్నికల సమయంలోనే పొత్తులపై నిర్ణయం ఉంటుందని స్పష్టంచేశారు. బిజెపి వ్యతిరేక పోరాటంలో లౌకిక, జాతీయ, ప్రాంతీయ పార్టీలను కలుపుకు పోతామన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, భూక్య వీరభద్రం, వై.విక్రమ్ పాల్గొన్నారు.

అన్ని నీటి వనరుల్లో ఉచిత చేప పిల్లలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ప్రోత్సాహంతో రాష్ట్రంలో మత్స్యరంగం ఎంతో అభివృద్ధి సాధించిందని, అన్ని నీటి వనరుల్లో ఉచిత చేప పిల్లలు వదులుతున్నామని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. సోమవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ బేగంపేటలోని హరితప్లాజాలో తెలంగాణ మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సహజ నీటి వనరుల్లో (ఇన్ లాండ్) చేపల పెంపకంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి, కులవృత్తులపై ఆధారపడిన వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు అన్ని నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. అన్ని నీటి వనరులకు జియో ట్యాగింగ్ చేస్తున్నట్టు చెప్పారు.

ప్రతిఏటా జూన్‌లో ఫుడ్ ఫెస్టివల్

వచ్చే సంవత్సరం నుంచి ప్రతిఏటా జూన్ 7, 8, 9 తేదీల్లో జిల్లాల్లో మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపలు, రొయ్యలతో చేసిన వివిధ రకాల వంటకాలను ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్ర అవసరాలకు సరిపడా చేప పిల్లల ఉత్పత్తిని రాష్ట్రంలోనే చేసుకునేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ముషం రమేష్, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి రమేష్, కోశాధికారిగా దండెంపల్లి సత్తయ్య, ఉపాధ్యక్షులుగా గుడిగందుల సత్యం, ఇనుముల శ్రీనివాస్, పెండెం రాములు, సిరిమల సత్యం ఎన్నికయ్యారు.

ప్రకటన
మహారాజశ్రీ విజయవాడ 3 వ సీనియర్ సివిల్ కోర్టులో
I.A. No. 396/2022
And
I.A. No.397/2022 in O.S NO. 615/2018
Between:-
B. Tulasi Naik and another ...Plaintiffs
AND
Cherukuru Sujatha and 4 Others ... Respondents

మూడవ **Respondent :**
Maddali Prameela W/o Venkateswara Rao, Hindu, aged about 64 years, Now Residing at R/o Sudhakar, Harijanawada, Gollapudi, Vijayawada Rural Mandal, Krishna District.

నాల్గవ **Respondent :**
Maddali Raghu S/o Venkateswara Rao, Hindu, aged about 30 years, Now Residing at R/o Sudhakar, Harijanawada, Gollapudi, Vijayawada Rural Mandal, Krishna District.

ఐదవ **Respondent :**
Banavathu Triveni, D/o. Late Tulasi Naik, Hindu, aged about 39 years, Resident of D.No.11-15-DC/SH-1/102, Flat No.102, Shyam Heights, Doctors Colony, Kothapeta, Saroornagar, K.V. Ranga Reddy District.

పై నెంబర్ లో మూడవ, నాల్గవ మరియు ఐదవ Respondents, ది. 09-12-2022 తేదీన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు లో హాజరై తమ ఏ విధమైన ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానించెదరు.

కోర్టు వారి అనుమతితో
వాయిదా:09-12-2022

ఇట్లు
తుమ్మల వెంకటదాస్,
పిటీషనర్ తరపు న్యాయవాది,
విజయవాడ.

మత్స్యకార్మికుల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య
- పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం : చెరుపల్లి

అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య, చెరుపల్లి, మత్స్య కార్మిక సంఘం కమిటీ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్యకార్మికుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానని తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తొలిసారిగా మత్స్యకారుల రాష్ట్ర సదస్సు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షత నిర్వహించిన ఈ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ... 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో మత్స్యకారులు చేపల వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నారన్నారు. అత్యధిక జనాభా కలిగిన మత్స్య కార కుటుంబాలు విద్యా, రాజకీయంగా వెనుకబడి ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం సిఎం కెసిఆర్ మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టిని పెంచాలనే సదుద్దేశంతో ఉచిత చేప పిల్లలు, వలలు, వాహనాలు, కమ్యూనిటీ భవనాలే కాకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని అన్నారు. అంబేద్కర్ మార్గదర్శకాలతో కుల వృత్తులకు ప్రోత్సాహమందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని తెలిపారు.

ఉచితంగా ఇస్తున్న పథకాలను బంధు చేయాలని బిజెపి కుట్ర పన్ని, రాష్ట్ర పాలనపై కక్షతో అక్కసు వెళ్లగక్కుతోందని విమర్శించారు. గతంలో రైతు నల్లచట్టాలు, నేడు మోటార్లకు మీటర్లు అంటూ రాజ్యాంగ విరుద్ధ పాలన సాగిస్తున్న బిజెపికి ప్రజలే బుద్ధి చెపుతారన్నారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. మత్స్యకారుల బతుకులు మారాలంటే ఐక్యంగా ఉండి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సమస్యల్ని పరిష్కరించుకునేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రం జిఎస్‌టి పేరిట పన్నుల్ని పెంచి ఇబ్బందులకు గురిచేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉచితాలను తొలగించాలనే కుట్ర పన్నుతున్నారని బిజెపిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ కార్యదర్శి లెల్లెల బాలక్రిష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం రూ.83 కోట్లతో ఉచిత చేపపిల్లల పంపిణీ చేస్తుండగా కాంట్రాకర్ల నిర్వాకంతో అన్యాయం జరుగుతోందని అన్నారు. మత్స్యకారులకు ఎన్‌సిడిసి, ఎన్‌ఎఫ్‌డిబిల ద్వారా 34 రకాల సంక్షేమ పథకాలు మత్స్యకారులకు అందించి చేయూతనివ్వాలని కోరారు. ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి వచ్చే బడ్జెట్లో రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని తెలిపారు. ప్రతి మత్స్యకార సొసైటీకి రూ.పది లక్షల ఆర్థిక సాయం అందించాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి మత్స్యకారునికి నెలకు రూ. ఐదు వేలు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. జిల్లా, మండల కేంద్రాల్లో అధునాతనమైన చేపల మార్కెట్‌ను నిర్మించి, మద్దతు ధర ప్రకటించాలని తెలిపారు.

ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించగా, సానుకూలంగా స్పందించి సిఎంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు గొరెంకల నర్సింహ, జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, జెడ్పిటిసి స్టాండింగ్ కమిటీ చైర్మెన్ మారపాక రవి, ఎంపిపి కందుల రేఖ, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదునూరి వెంకట్రాజ్యం, మాచర్ల గణేష్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శులు ముఠా విజయ్, తేలు ఇస్తారి, గొడుగు వెంకట్, పగడాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ లోగో ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రమాదంలో పత్రికా స్వేచ్ఛ

- మీడియాలో పెరిగిన యాజమాన్యాల చొరవ
- టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర మహాసభ లోగో ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆధునిక యుగంలో పత్రికా స్వేచ్ఛకు ప్రమాదకర పరిస్థితి ఎదురైందని, జర్నలిస్టుల హక్కులకు ఆటంకం కలుగుతోందని పలువురు సీనియర్ పాత్రికేయులు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ద్వితీయ మహాసభ 'లోగో' ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ తిరుమలగిరి సురేందర్, ప్రజాశక్తి మాజీ ఎడిటర్ వినయకుమార్, ఇండియా టివి తెలంగాణ ఇన్‌చార్జి సురేఖ తదితరులు పాల్గొని మహాసభ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయకుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు, అన్యాయాలు, పేద వర్గాలపై జరిగే వివక్షలపై వార్తలు రాసేందుకు కూడా విలేకరులు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితులు తలెత్తడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు జర్నలిస్టులను, యూనియన్లను అణచివేస్తున్నాయని చెప్పారు. వార్తల ప్రచురణలో ఎడిటర్ల చొరవ తగ్గి, యాజమాన్యాలది పెరిగిపోవడం దురదృష్టకరమన్నారు. దీంతో క్వాలిటీ కంటెంట్‌లు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ జర్నలిజంలో మరింత బాధ్యతగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకూ మీడియా అంటే చిన్నచూపు కలిగే పరిస్థితి వచ్చిందన్నారు.

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ తిరుమలగిరి సురేందర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్లు పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ మద్దతును కూడగట్టుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. ఈనెల 27న హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్బన్, రూరల్ జర్నలిస్టుల సమస్యలపై మహాసభలో చర్చించి వారికి న్యాయం జరిగే విధంగా తీర్మానాలు చేయబోతున్నట్టు చెప్పారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం చేయాలన్నారు. ఇండియా టివి తెలంగాణ ఇన్‌చార్జి సురేఖ మాట్లాడుతూ.. మీడియాలో మహిళల ప్రాధాన్యత పెరగాలన్నారు. కోవిడ్ వంటి పరిస్థితులు తలెత్తినా, జర్నలిస్టులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్లు కూడా ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. హెచ్‌యుజె అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. టిడబ్ల్యుజెఎఫ్ మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌డబ్ల్యూజే కార్యదర్శి పి ఆనందం, టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు ప్రభాకర్, రాంచందర్, హెచ్‌యుజె కార్యదర్శి బొల్లె జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, కోశాధికారి బి రాజశేఖర్, హెచ్‌యుజె కార్యవర్గ సభ్యులు మధుకర్, బాలు, క్రాంతి, రామకృష్ణ, మాధవ రెడ్డి, వి కిరణ్, కాలేబ్, శ్రీధర్, విజయ, లలిత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో మార్పులకు శ్రీకారం

- ఉన్నత విద్యామండలి, టిసిఎస్‌అయాన్, టిఎస్ ఆన్‌లైన్ సమావేశంలో మంత్రి సబిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్కెట్ అవసరాలు, డిమాండ్ ఉన్న కోర్సులతోనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ఇంజినీరింగ్‌తోపాటు డిగ్రీ చదివిన విద్యార్థులూ ఐటీ, ఇతర పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని రంగాల్లో ముందున్నట్టుగానే విద్యారంగంలోనూ తమ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. 'విద్యారంగంలో సాధికారత– ఉపాధి అవకాశాల పెంపుదల'అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి, టిసిఎస్ అయాన్, టిఎస్ ఆన్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మట్లాడుతూ.. ఏటా లక్షల సంఖ్యలో విద్యార్థులు పట్టాలు చేతిలో పట్టుకుని కోటి ఆశలతో బయటికెళ్తున్నారని అన్నారు. కానీ వారంతా వృత్తి నైపుణ్యం లేక ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని సమూలంగా మార్చాల్సిన అవసరముందన్నారు. కొన్ని కాలేజీల్లో విద్యార్థులు పోటీపడి చేరితే మరికొన్నింటి వైపు చూడటం లేదని వివరించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ల కారణంగానే ఆయా కాలేజీల్లో పోటీపడి చేరుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో విద్యార్థులు పోటీపడి చేరే రోజులు రావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ దిశగా డిమాండ్ ఉన్న కోర్సులను రూపొందించాలని ఉన్నత విద్యామండలి, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పరిశ్రమలతో విద్యార్థులను అనుసంధానించాలని, ఈ దిశగా రోడ్‌మ్యాప్‌ను రూపొందించి అమలుచేయాలని సూచించారు. విద్యార్థులకు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమని ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ సూచించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కొత్త కోర్సులను అందుబాటులోకి తెస్తున్నామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి అన్నారు. బిఎస్‌సి బిజినెస్ అనలిటిక్స్, బిఎస్‌సి డాటా సైన్స్, బిఎ ఆనర్స్ వంటి కోర్సులను ప్రవేశపెట్టామని వివరించారు. భవిష్యత్తులోనూ మరిన్ని కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న కరిక్యులం (పాఠ్యప్రణాళిక) 20 ఏండ్ల క్రితం నాటిదని అన్నారు. దీన్ని పూర్తిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టీహబ్, వీహబ్ తరహా సెంటర్లను విద్యాసంస్థల్లోనూ ఏర్పాటు చేయాలని సూచించారు.

పాతబస్తీలో పోలీసుల తనిఖీలు

- చార్మినార్‌కు బాంబు బెదిరింపు అని ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో బాంబు బెదిరింపు కలకలం రేపింది. పాతబస్తీలోని చారిత్రక కట్టడం చార్మినార్‌కు బాంబు బెదిరింపు కాల్ వచ్చిందని.. అందుకే పోలీసులు తనిఖీలు చేపట్టారని సామాజిక మాధ్యమాల్లో వార్తలు గుప్పుమన్నాయి. అయితే, ఈ వార్తలను పోలీసులు తీవ్రంగా ఖండించారు.

సాధారణ తనిఖీల్లో భాగంగానే సోమవారం చార్మినార్ పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు, దుకాణాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇది గమనించిన కొంతమంది భయపడి బాంబు కోసమే తనిఖీలు చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు చార్మినార్‌కు ఎలాంటి బాంబు బెదిరింపు కాల్ రాలేదని.. ఇదంతా తప్పుడు ప్రచారమని స్పష్టం చేశారు. చార్మినార్ వద్ద సాధారణ తనిఖీలే చేపట్టామని వెల్లడించారు.

టెన్త్ లాంగ్‌మెమోల జారీ

- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల లాంగ్‌మెమోలను జారీ చేసినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ. కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరి మెమోలను ఆయా పాఠశాలలకు పంపించామని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి వాటిని విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. మే లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల ఫలితాలు జూన్ 30న విడుదలయ్యాయి. 5,03,579 మంది విద్యార్థులు రెగ్యులర్ హాజరైతే 4,53,201 మంది ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సెప్టెంబర్ ఒకటిన విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో 38,477 మంది పాసయ్యారు. వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 4,91,678 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు.

ప్రయివేటు అప్పులు కట్టేందుకు రుణాలివ్వాలి

- పిఎంకు పాకాల శ్రీహరిరావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల్ని ప్రయివేటు అప్పుల నుంచి బయటపడేసేందుకు వీలుగా వారికి రుణాలిచ్చేలా దేశవ్యాప్తంగా బ్యాంకులను ఆదేశించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరిరావు కోరారు. ఈ మేరకు ఆయన ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. రైతుల ఆర్థిక పరిస్థితి దిగజారడానికి ప్రయివేటు అప్పులు, అధిక వడ్డీలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ భారం నుంచి రైతులను రక్షించడానికి 2004 నుంచి ఆర్ బిఐ అన్ని బ్యాంకులకు ఆదేశిస్తోందని గుర్తుచేశారు. అయితే బ్యాంకులు ఇలాంటి రుణాలివ్వడం లేదని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2008లో బ్యాంకులిచ్చే వ్యవసాయ రుణాల్లో మూడు శాతం రుణమార్పిడి చేయాలంటూ ఆదేశించినప్పటికీ, దాన్ని తిరిగి సమీక్షించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరేండ్లుగా సంబంధిత అధికారులందరు ఆ ఆదేశాలను పాటించాలని కోరినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. రైతు ఆత్మహత్యలను తగ్గించడానికి ప్రతి రైతుకు రబీ మార్గదర్శకాల ప్రకారం రుణమార్పిడి చేసేలా ఇచ్చేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారం కోసం అడ్డదారులు తొక్కిన బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారం కోసం ఎనిమిది రాష్ట్రాల్లో అడ్డదారులు తొక్కిన చరిత్ర బిజెపిదని టిఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టిఆర్‌ఎస్ అధికారం కోసం అడ్డదారులు తొక్కిందంటూ బిజెపి శిక్షణా తరగతుల్లోమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు.

వెట్టి చేస్తున్నారు.. కాస్త బువ్వ పెట్టండి

- చట్టపర సౌకర్యాలు అమలు చేయాలి
- డైలీవేజ్ ఔట్ సోర్సింగ్ కార్మికుల ధర్నాలో జూలకంటి
- సమస్యలు పరిష్కరిస్తాం : అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థినీ, విద్యార్థులకు సేవలందిస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సేవలకు వెల కట్టలేమనీ, వెట్టి చాకిరి చేస్తున్నారు.. వారి కడుపుకింత బువ్వ పెట్టటం కష్టమా? అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ భవన్ ముందు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలనీ, నెల నెలా జీతాలు ఇవ్వాలనీ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, సుప్రీం కోర్టు తీర్పుకనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తున్నారు.. కనీస వేతనాలు ఇవ్వటానికి ఈ ప్రభుత్వానికి ఎం ఇబ్బందులు వచ్చాయ్? వారి సేవకు గుర్తింపు లేదా? అని ప్రశ్నించారు. చట్టాలు, జిఒలు తెచ్చిన ప్రభుత్వమే వాటిని అమలు చేయకపోతే ఎట్లా? అని అడిగారు. పనెక్కువ ఫలితం తక్కువగా ఉన్నప్పుడు వారు, వారి కుటుంబాలు ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కార్మికుల్లో పనిచేసేవారందరూ దళిత, గిరిజనులే ఎక్కువగా ఉన్నారన్నారు. వారి కోర్కెలు గొంతెమ్మ కోర్కెలు కాదని చెప్పారు. తామూ మనుషులమే.. తమకు కనీస అవసరాలుంటాయ్ అని వారు అడుగుతున్నారని, ప్రభుత్వం వారి వేదనను వినాల్సిందేనని డిమాండ్ చేశారు. సమస్యలను పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవటం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారనీ, గిరిజన విద్యారంగం అభివృద్ధిలో వీరి శ్రమ కీలకమని చెప్పారు. ప్రతి కార్మికుడికి పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని మానుకోవాలన్నారు. ఇప్పటికైనా బకాయి వేతనాలు విడుదల చేయాలనీ, నెలనెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ మాట్లాడుతూ డైలీవేజ్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం పేరుతో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం శ్రమ దోపిడి చేస్తున్నదని విమర్శించారు. చనిపోయిన వారసులకు డైలీవేజ్ వర్కర్లుగా ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే నిరవధిక సమ్మె చేయక తప్పదని హెచ్చరించారు. ఆ తర్వాత జూలకంటితో పాటు సంఘం నేతలు అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. దీంతో ఆయన ధర్నా వద్దకు వచ్చి ఈ నెల 30న జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి సమస్యలు పరిష్కరిస్తాంటూ కార్మికులకు హామీ ఇచ్చారు. నాలుగు రకాల పేర్లతో కార్మికులు పనిచేస్తున్నారనీ, వారందరినీ ఒకే పేరు కిందకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. చనిపోయిన కార్మికుల వారసులకు ఉద్యోగాలిచ్చే విషయం, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సమస్యలను పరిష్కరిస్తామని హామీని ఇచ్చారు. ప్రభుత్వ విధానాలతో ముడిపడిన అంశాలను సమగ్ర నివేదిక ప్రభుత్వానికి ఇస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టేకం ప్రభాకర్, బి మదు, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, రాష్ట్ర కార్యదర్శులు కె బ్రహ్మాచారి, రాజేందర్, రాష్ట్ర నాయకులు రాములు, కోటేశ్, నంగ్యా, హీరాలాల్, ముత్తయ్య కౌశల్య, జలందర్, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, పద్మ, సదాశివం, సక్రు, కోటయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం

- ట్రాఫిక్ జాయింట్ సిపి రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం కానున్నాయి. రాంగ్ రూట్, ట్రిపుల్ రైడింగ్ చేస్తే భారీగా జరిమానా విధించేందుకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ రంగనాథ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఏ వాహనం వల్ల ఎక్కువ విధ్వంసం జరిగేందుకు అవకాశం ఉంటుందో.. అలాంటి వాహనాలు నిబంధనలు అతిక్రమిస్తే ఎక్కువ మొత్తంలో జరిమానా విధించాలని నిర్ణయించినట్లు రంగనాథ్ తెలిపారు. రాంగ్ రూట్‌లో రావడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని, అందుకే ఇలాంటి సందర్భాల్లో నిబంధనలు పాటించని వాహనాలకు పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తున్నామన్నారు. రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలకి రూ.1,700 వరకు, ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ.1200 వరకు జరిమానా విధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 28 నుంచి ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఎవరైనా పట్టుబడితే ఆ వాహనదారుడిపై గతంలోనూ ఏమైనా చలాన్లు ఉన్నాయా? లేవా? అనే విషయాలనూ పరిగణనలోకి తీసుకుంటామన్నారు. వాహనదారులు చేసిన తప్పే మళ్లీ చేయకుండా.. వారిలో క్రమశిక్షణ తీసుకువచ్చేందుకే నిబంధనలు మరింత కఠినతరం చేస్తున్నామని వివరించారు. పోలీసులు, ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారని, ప్రభుత్వం పోలీసు శాఖకు రూ.వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తోందన్నారు.

ఫార్మసీ కోర్సుల్లో మిగిలిన సీట్లు 136

- ఎంసెట్ బైపిసి విద్యార్థులకు తుదివిడతలో సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో కేవలం 136 సీట్లు మాత్రమే మిగిలాయి. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు తుదివిడత కౌన్సెలింగ్‌లో భాగంగా సోమవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ నవీన్ మిట్టల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్మసీ కోర్సుల్లో 9,520 సీట్లున్నాయని వివరించారు. మొదటి విడతతో కలిపి 9,384 (98.57 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 136 (1.43 శాతం)సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. బీ ఫార్మసీలో 116 కాలేజీల్లో 7,918 సీట్లున్నాయని వివరించారు. 7,784 (98.30 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. 134 (1.70 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఫార్మా-డీ కోర్సుకు సంబంధించి 64 కాలేజీల్లో 1,436 సీట్లుంటే 1,435 (99.93 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. ఇందులో ఒక సీటు మిగిలిందని తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్ కోర్సులో ఒక కాలేజీలో 11 సీట్లు, బయోటెక్నాలజీలో రెండు కాలేజీల్లో 67 సీట్లుంటేవంద శాతం భర్తీ అయ్యాయని వివరించారు. ఫార్మా సూటికల్ ఇంజినీరింగ్ కోర్సుకు సంబంధించి రెండు కాలేజీల్లో 88 సీట్లుంటే, 87 సీట్లు భర్తీ అయ్యాయనీ, ఒక సీటు మిగిలిందని తెలిపారు.

సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లు నమోదు చేయకపోవడం వల్ల 7,346 మందికి సీట్లు కేటాయించలేదని పేర్కొ న్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కింద 661 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని వివరి ంచారు. ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్‌రిపోర్టింగ్ ద్వారా వివరాలు నమోదు చేసేందుకు ఈనెల 24వ తేదీ వరకు గడువుందని తెలిపారు. సీట్లు కేటాయించిన విద్యార్థులు ఈనెల 25వ తేదీ నాటికి ఆయా కాలేజీల్లో చేరాలని కోరారు. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్ర దించాలని సూచించారు.

ఉద్యమ పాటలకు గుర్తింపు

- తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్‌లో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి
- భావాన్ని భౌతిక శక్తిగా మార్చే ఇంధన శక్తి పాట : కె.దేవేంద్ర
- పాట మీద లిటరరీ ఫెస్ట్ గొప్ప పరిణామం : సినీగీత రచయిత భారవి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎదుటి వ్యక్తుల హృదయాలను అత్తుకునేలా రాస్తేనే నాలుగు కాలాల పాటు జనం నోళ్లల్లో పాట మెదులుతుందనీ, తెలంగాణ గడ్డపై ఉద్యమ పాటలకు మంచి గుర్తింపు దక్కుతుందని ప్రముఖ కవి, సినీగేయ రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్‌లో ఆయన మాట్లాడారు. జానపద, ఉద్యమ, లలిత గేయాల్లో సాహిత్యం లేదని పండితులు వాటిని చాలా కాలం పాటు తృణీకరించుకుంటూ పోయారనీ, కాలక్రమంలో వాటిల్లోనూ సాహిత్యం ఉందని ఆయా విభాగాల్లోని నిష్ణాతులు తమ అస్తిత్వాన్ని నిరూపించారని వివరించారు. దేనికదే గొప్పదనీ, ఒకదానితో మరోదానితో పోలికపెట్టి తక్కువ చేసి చూడొద్దని వేడుకున్నారు. రచయితలకు మొదటి స్థానం ఇచ్చే సంగీత దర్శకులు కెవి మహదేవన్ అని కొనియాడారు. ట్యూన్ ఇచ్చినా, ఇవ్వకపోయినా అందర్నీ సంతృప్తిపరిచే పాట రాయడం చాలా కష్టమని చెప్పారు. మంచి ఉద్యమ పాటలు రాస్తే సినిమా పరిశ్రమనే వెతుక్కుంటూ రచయితల వద్దకు వస్తుందని తన నిజ జీవితంలో ఎదురైన అనుభవాలను వివరించారు. ఉద్యమ రచయితగా అవకాశం దొరకడం తన అదృష్టమన్నారు. త్రిసర, చతుర, ఖండ, మిశ్రమ గతులనే నాలుగు చందస్సుల మీద పట్టుంటే పాటలు రాయడం చాలా తేలిక అనీ, అయితే, నిర్మాతలు, దర్శకులను ఒప్పించడం చాలా కష్టమని చెప్పారు. ఎంతపెద్ద రచయిత అయినా సినిమా ఇండస్ట్రీలో లౌక్యం అవసరమని పలు ఉదహరణలతో వివరించారు. సినిమాలకు పాటలు రాయడం కంటే ఉద్యమ పాటలు రాయడమే మంచిదనే నిర్ణయానికి కట్టుబడి ఉన్నానన్నారు. ప్రొడ్యూసర్లు ఇచ్చిన డబ్బుల కంటే పేలాలు అమ్ముకునే వ్యక్తి పాటను గుర్తించి తన దగ్గర డబ్బులు తీసుకోను అన్నప్పుడు పొందిన ఆనందం మరువలేనిదన్నారు.

ఉద్యమ పాటకే ఆదరణ ఎక్కువ : కె.దేవేంద్ర, ప్రముఖ గీత రచయిత

మొదటి నుంచి తెలంగాణ గడ్డపై ఉద్యమ పాటకే ఆదరణ ఎక్కువని అభ్యుదయ ఆర్ట్ బాధ్యులు, ప్రముఖ గీత రచయిత కె.దేవేంద్ర అన్నారు. 67 ఏండ్ల తన జీవితంలో 52 ఏండ్లుగా పాటతోనే ప్రయాణం సాగుతున్నదన్నారు. ప్రజానాట్యమండలి అనే చెట్టుకు అంటుకట్టడం, సేద్యం చేయడం, పాట తీయడం, అందులోని మట్టి వాసనలు, పూల పరిణామాలను ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ బతుకున్నవాడినని చెప్పారు. జీవితంపై కాలం చేసిన సంతకం పాట అని ఒక్క మాటలో చెప్పేశారు. పాట వ్యక్తిగతం కాదనీ, శ్రమిష్టి శ్రమకు రూపమనీ, పాటకు పంచప్రాణాలు అవసరమని తెలిపారు. ప్రతి పాటా తనదైన చందస్సును కలిగి ఉంటుందనీ, అలాగైతేనే అది రక్తి కట్టించగలుగుతుందని వివరించారు. కవిత్వం రాసేవాళ్లకంటే పాట రాసేవాళ్లకు శిక్షణ ఇవ్వడమే కష్టమన్నారు. తెలంగాణ గడ్డపై ఎప్పుడైనా ఉద్యమ పాటకే ఆదరణ ఎక్కువని చెప్పారు. తెలంగాణ గడ్డలోనే రోషం ఉందనీ, మాటలో ఒక సంగీతం, ఒక లయ, ఒక వేగవంతమైన ఉద్వేగ పూరితమైన గొప్ప పాట ఉందని నమస్కరించారు. లైకుల కోసం, ప్రచారం కోసం ఇష్టానుసారం ఇటీవల అర్థంపర్థం లేని కొన్ని పాటలు వస్తుండటం బాధాకరమన్నారు. తెలంగాణ గడ్డ మీద ఉన్న రచయితలను అధ్యయనం చేసే రీసెర్చి ప్రాజెక్టు లాగా పాటకు జేజేలు ఫెస్ట్ దోహదపడుతుందని ఆకాంక్షించారు. మానవ జీవితం, పరిసరాలు, రాజకీయాలు, ఉద్యమాలు, ప్రయాణ గమనాలను పరిశీలించకుండా, ఒంటపట్టించుకోకుండా జనం మెచ్చే పాట రాయడం సాధ్యం కాదన్నారు. భావం భౌతికశక్తిగా మార్చటానికి పాట ఒక ఇంధన శక్తిగా దోహదపడుతుందని నొక్కి చెప్పారు.

జీవితం చివరికల్లా విప్లవ రచయితగా గుర్తింపు పొందుతా : జేకే భారవి

పాట పుట్టిన తర్వాత పాటపై ఇంత పెద్ద కార్యక్రమం జరగటం గొప్ప పరిణామం అని ప్రముఖ సినీ గేయ రచయిత జేకే భారవి ప్రశంసించారు. నందిని సిధారెడ్డి కామదేనువు లాంటి రచయిత అని కొనియాడారు. తెలంగాణ స్లాగ్‌లో తాను రాసిన తొలి స్క్రిప్టు కాలిన చేతుల్లో మాడిన న్యాయం అనీ, అది ప్రెసిడెంట్ అయిన తన నాన్న, ఇద్దరు మామలను విలన్‌లుగా పెట్టి రాశానని చెప్పారు. తనకు జరిగిన అన్యాయంపై పోరాడేందుకు ఓ కొడుక్కి జోలపాటలో విప్లవాన్ని, తారంగం పాటలో రణరంగాన్ని, చందమామ పాటకు బదులుగా సూర్యుడా..రారా..మంటల్ని తేరా..అన్యాయాన్ని కాల్చేసి పోరా అని రాసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అదే స్క్రిప్టును ఆత్రేయ చేతుల్లో పెడితే పులకించిపోయి మద్రాసుకు పట్టుకుపోయి తనని వారసునిగా చేసుకున్నాడన్నారు. 11 ఏండ్ల శిష్యరికంలో తమ మధ్య నిత్యం ఘర్షణే జరిగేదనీ, విప్లవ భావాలు ఏమయ్యాయని ప్రశ్నించేవాడినని తెలిపారు. అయినా, ఆత్రేయ పాటల్లో విప్లవ భావాలు కనిపిస్తాయన్నారు. విప్లవ పోరాటంలో కలిసిపోదామనుకున్నాననీ, చివరకు తనమీద ఆధ్యాత్మిక సినిమాల స్క్రిప్టు, పాటల రచయితగా ముద్ర పడిందన్నారు. ఇది ఒక కోణమేననీ, కారల్‌మార్క్స్, విప్లవ ఐడియాలతో అద్భుత కథనాలు తన దగ్గర ఉన్నప్పటికీ నిర్మాతలు ముందుకు రావడం లేదని చెప్పారు. తన జీవితం చివరి కాలం నాటికి ఒక విప్లవ రచయితగా గుర్తింపు పొందుతానని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ లిటరరీ ఫెస్ట్‌లో మ్యూజిక్ డైరెక్టర్ మద్దూరి ఐలయ్య, ప్రజా గాయకులు కాంపాటి శ్రీను, ఆర్.సైదులు, ప్రజా రచయిత ఏ.భాస్కర్ తదితరులు మాట్లాడారు. పలువురు గాయకులు పాటలను పాడారు. సినీ గేయ రచయితలపై పరిశోధక విద్యార్థులు పత్రాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత తిరునగరి శరత్‌చంద్ర, దుర్గాచారి, తెలంగాణ సాహితీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభాపురం జనార్ధన, కె.ఆనందాచారి, ఉపాధ్యక్షులు రాంపల్లి రమేశ్, తంగిరాల చక్రవర్తి, సహాయ కార్యదర్శి సలీమా, కోశాధికారి అనంతోజు మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.